# విందు భోజనాలు

**వి**నీల్, అనీల్ కవల పిల్లలు. ఇద్దరూ చదువులో ఫస్టే. ఇంజనీరింగ్ చదువుకుని అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. రెండేళ్లకొకసారి ఇద్దరూ కలిసి ఇండియా వస్తుంటారు. వీళ్లకి ఒక్కర్తే అక్కయ్య. బావగారు వైజాగ్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఈ అన్నదమ్ములిద్దరూ దాదాపుగా ఒకనెల వుండి వాళ్ళకి ఇష్టమైనవన్నీ చేయించుకుని తింటుంటారు.

ప్రతీసారిలాగే ఈసారి కూడా అన్నదమ్ములిద్దరూ ఇండియా వచ్చారు. తల్లికి ఒంట్లో సుస్తీగావున్నా, వీళ్ళు మాత్రం వాళ్ళకి ఇష్టమైనవన్నీ చేయించుకునితింటూనే వున్నారు. ఈసారి, తల్లి నీరసం వలన, ఎక్కువగా పనిచేయలేకపోతుంది. ఇదే విషయం తన కూతురు అమలతో చెప్పింది. అమల వెంటనే వైజాగ్ పంపెయ్యమంది.

వైజాగ్‌కి వెళ్ళమన్నారు కవలలు. "వెళ్లండిరా. అమల అత్తగారు చాలా మంచావిడ. పొగిడితే చాలు ఏమైనా చేసేస్తుంది", అంది తల్లి.

"అయితే సరే" అని వైజాగ్ వెళ్ళారు కవలలు.

వీళ్ళు వచ్చే ముందే అమల, తన అత్తగారితో అంది "మా తమ్ముళ్లిద్దరూ మన ఇంటికి వస్తున్నారు. అసలు అమెరికా నుంచి సెలవుమీద వచ్చిన వాళ్ళు మా అమ్మ దగ్గర ఉండకుండా ఇక్కడికెందుకు వస్తున్నట్లు చెప్పండి"

"అదేమిటమ్మా... అక్కయ్య ఇంటికొస్తే తప్పేంటి?" అంది అమల అత్తగారు.

"ఔననుకోండి. అయినా ఎక్కువరోజులుండకుండా పంపేద్దాం" అంది అమల.

"ఏం ఫర్వాలేదు. వాళ్లకిష్టమైనన్ని రోజులుండనీ" అంది. ఎడ్డెమంటే, తెడ్డమనే అమల అత్తగారు.

ఆ మర్నాడు కవలలు దిగారు. వస్తూనే అత్తగారి కాళ్లకి నమస్కారం పెట్టారు. ఆవిడ మురిసిపోయింది. ఆవిడ కొడుకు కూడా ఎప్పుడూ పాదాభివందనం చేయడు.

సాయంకాలం ఆరుబయట కూర్చున్నప్పుడు వినీల్, "అత్తయ్యగారూ! పెసరట్లలో అల్లం చితక్కొట్టి, ఆరసం పోసి పెరసట్లు వేస్తే బాగుంటుందంటారు. మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగారు.

"ఛీ తప్పమ్మా! అలా రసం వేస్తే పిండి పల్చబడి, అట్లు సరిగ్గా రావు" అంది ఆవిడ.

"అందుకేరా, ఆరోజు మన పిన్ని అల్లం రసం పెసరట్లలో వేయడం వలన, అట్లు సరిగ్గా రాలేదు" అన్నాడు అనీల్.

వెంటనే ఆవిడ "అమలా! ఒక కేజీ పెసరప్పు నీళ్ళల్లోపోసేయ్. ఆ...అన్నట్లు పెసరపప్పు వద్దు. ముడిపెసలు నానపెట్టు. పాపం అమెరికాలో వీళ్ళు జిహ్వాచచ్చి పోయుంటారు. శుభ్రంగా పెసరట్లు వేసి పెడదాం" అంది అత్తగారు.

అత్తగారు చూడకుండా, కవలలు షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు.

ఆ మర్నాడు ఉదయం ఏడుగంటలకల్లా, పెనంమీద పెసరట్లు వేయడం మొదలయిపోయింది.

ఇద్దరూ తినడం మొదలుపెట్టారు. తినేటప్పుడు వినీల్ అన్నాడు అత్తయ్యగారు! కొంతమంది పెసరట్టు వేసేటప్పుడు, ఆ గరిట పెనం మీద చుట్టూ తిప్పుతూ, వాళ్ల బుర్ర కూడా తిప్పుతారు".

"ఆ.. వాళ్లతలకాయ, వాళ్ళకి తల తప్ప అందులో గుంజు ఉండదు. అసలు అలా తిప్పేవాళ్ళకి పోను పోను బుర్ర తిరుగుడు రోగం కూడా వస్తుంది" అంది అత్తగారు.

"నాయనా అనిల్! మొహమాటపడకుండా తిను".

అదివిన్న అనీల్ అన్నాడు "అసలిప్పటివరకూ ఎన్ని పెసరట్లు వేసి వుంటారు అత్తయ్యగారు!"

"ఓ ఇరవై వేలు వేసి వుంటాను"

"అబ్బ... సచిన్ పరుగలకంటే చాలా ఎక్కువ" అన్నాడు అనీల్.

“అసలు అత్తయ్యగారి దివ్యతేజస్సువలన పెనం కూడా ధగధగ మెరుస్తోంది” అని, పెనం దగ్గరే కూర్చుని పెసరట్లు మటుమాయం చేసారు కవలలు.

ఇదంతా చూస్తున్న అమల మామగారు తన భార్య శాపగ్రస్తురాలిలా పెసరట్లు వేయడం భరించలేకపోయాడు. ఇదింత వెర్రిది కనుకనే, అడిగినంత కట్నం ఇచ్చారు, అనుకున్నాడు మనసులో.

తిన్న పెసరట్లు ఏమీ హాని చేయలేదని నిర్ధారించుకున్న తరువాత, ఒకరోజు రాత్రి “అత్తయ్య గారూ! అరిసెలు పంచదారతో చేస్తే బాగుంటాయా? బెల్లంతో చేస్తే బాగుంటాయా? అని ఇద్దరు కవలలు, ఒకేసారి అడిగారు.

అదికాదు బాబూ! కొన్ని కొన్ని తీపి పదార్థాలు ఎప్పుడూ బెల్లంతోనే చేయాలి. అరిసెలు బెల్లంతోనే బాగుంటాయి” అంది అత్తగారు.

“మిగిలినవి ఏమేం బెల్లంతో చేస్తారో చెప్పండి అత్తయ్యగారూ” అన్నాడు అనీల్.

“దీని పనయిపోయింది” అనుకున్నాడు మామగారు.

“జిలేబీ, బొబ్బట్లు, మిఠాయికొమ్ములు, కరకజ్జం వగైరా బెల్లంతో చేస్తే అమోఘంగా ఉంటాయి”.

“అరే వినీల్! వెర్రివెధవలా వింటూ కూర్చుంటావేంట్రా? అవి రాసుకో. చాలా విధాలా ఉపయోగం” అన్నాడు అనీల్.

“ఆ అన్నట్లు పంచదారతో ఏమేం చేస్తే బాగుంటాయో కూడా చెప్పండి” అని అడిగాడు. వినీల్, అన్ని ఐటమ్స్ ఒకేసారి రాసుకుందామని.

“వీళ్ళు దేవాంతకుల్లా ఉన్నారే!. ఇవన్నీ చేయ్యలేక తన భార్య చచ్చిపోతుందేమో అనుకుని, “నాకు ఆకలిగా ఉంది. అన్నం పెట్టు’ అని ఆవిడ్ని లోపలకు తీసుకెళ్ళి పోయాడు మామగారు.

“అసలు ఇటువంటి ప్రస్తావనలు మామయ్యగారు లేనప్పుడు చేయాలిరా” అన్నాడు వినీల్.

లోపల్నుంచి వచ్చిన అమల "మీరిద్దరూ మా అత్తగార్ని భలే మాయ చేస్తున్నారు. అరిసెలు చేయడానికి బియ్యం నానపోసేయన్నారు. రేపు రాత్రి మనం బోలెడు అరిసెలు తినొచ్చు" అంది.

భోజనం చేసి బయటికొచ్చిన మామగారు అడిగారు "సెలవులింకా

ఎన్నాళ్లు ఉన్నాయి బాబు! పెద్ద అదృష్టం.... ఇద్దరికీ ఒకేసారి సెలవు దొరకడం!"

"సెలవులు యింకా యిరవై రోజులున్నాయ్! కావలసివస్తే సెలవు పొడిగిస్తాం" అన్నారు కవలలు.

"పొడిగించకండి. పెళ్ళిళ్లప్పుడు కావాల్సి వస్తుంది" అన్నారు మామగారు, పెళ్ళిలో అయితో, బోలెడు అరిసెలు, లడ్డూలు, మినపసున్ని ఉంటాయని.

ఆయన లోపలకు వెళ్ళిన తరువాత వినీల్ "ఇద్దరికీ సెలవులు ఒకేసారి దొరకడం అదృష్టం అన్నాడు ఆయన. అర్థమయిందా! అత్తయ్యగారు మనం ఇండియాకి విడివిడిగా వస్తే, ఒకే ఐటమ్ రెండేసిసార్లు చేయాలని."

"ఏది ఏమైనా మీ మామగారు మాత్రం గొప్ప ఘటికుడే బాబూ" అన్నాడు అనీల్, అమలతో.

ఆ మర్నాడు రాత్రి, అరిసెలు తిని పడుకున్నారు కవలలు.

మర్నాడు పొద్దునే "రాత్రి మినపసున్ని కలలోకి వచ్చింది" అన్నాడు వినీల్. 'అదేం పెద్ద భాగ్యం, ఈ రోజు మినపసున్ని చేస్తాను బాబూ' అంది అత్తయ్యగారు.

"మేం వెళ్ళేలోపు ఇంకోసారి పెసరట్లు వేయండి.అత్తయ్యగారూ" అన్నాడు అనీల్.

'అలాగే నాయనా" అంది, ఆవిడ.

మామగారు మినపసున్ని స్వగృహపుడ్స్ నుంచి తెస్తానన్నారు.

"వద్దండి. పాపం పిల్లల అమెరికా నుంచి వచ్చారు. అస్తమానం వస్తారా ఏమిటి. నేనింట్లో చేసి పెడతాను" అంది అత్తయ్యగారు.

'ఈరకంగా మేపితే వీళ్లసలు అమెరికాకు వెళ్లరు' అనుకున్నాడు మామగారు. ఈరకంగా తన అక్క అత్తగార్ని వేపుకుతిని, ఆవిడ చేసినవన్నీ తిని, వెళ్ళేటప్పుడు 'అమెరికా నుంచి ఏమైనా కావాలంటే తీసుకొస్తాం. అత్తయ్యగారు చెప్పండి'' అన్నారు.

మంటెక్కిపోయిన మామగారు 'ఒక పెద్ద మిఠాయి చట్రం, ఒక పెద్ద మూకుడు, ఒక పెద్ద పెనం తీసుకురండి నాయనా. మీ విందు భోజనాలకి పనికొస్తాయి'' అన్నాడు.

కవలలు ఖంగుతిన్నారు.

(ఆంధ్రభూమి సచిత్రమాసపత్రిక, మే 2006)